మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

తొండుపల్లిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, తదితరులు

శంషాబాద్ రూరల్, జూలై 9: చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు. మంగళవారం శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లిలో వన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. అనంతనం ఆయన మాట్లాడుతూ.. చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి పదేండ్ల పాటు మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యం లో తెలంగాణలో హరితహారంలో భాగంగా భారీగా మొక్కలు నాటిన్నట్టు తెలిపారు. వాటి ఫలితాలే నేడు వర్షాలు కురుస్తున్నాయని వివరించారు. ముఖ్యంగా తెలంగాణలో భారీ ఎత్తున అటవీ సంపదను పెంచామని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీలో పాలకవర్గం భారీగా మొక్కలు నాటిన్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిసనర్ సుమన్‌రావు, కౌన్సిలర్లు మేకల వెంకటేశ్, లావణ్య గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, నాయకులు కొన్నమొల్ల శ్రీనివాస్, దయానంద్, నీరటి రాజుముదిరాజ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, మురళీయాదవ్, బుచ్చిరెడ్డి, మున్సిపాలిటీ వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి

హిమాయత్‌నగర్, జూలై 9: రాష్ట్రంలోని కార్మికులంతా ఐక్యతతో ముందుకు సాగి తమ హక్కులను సాధించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపునిచ్చారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. సమాన పనికి సమాన వేతన విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు సామాజిక భద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

14న భక్తి కుటీర్ రథయాత్ర

మణికొండ, జూలై 9: మణికొండ భక్తి కుటీర్ నిర్వహిస్తున్న రథయాత్ర మహోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ అల్కాపూర్ టౌన్‌షిప్ తుల్జారామ్‌బాగ్ ఆలయంలో ఈ నెల 14న ఆదివారం మొదటి రథయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథులుగా ఇస్కాన్ హెచ్‌టీఎంసీ మెంబర్ రాధేశ్యామ్‌దాస్ హాజరవుతారన్నారు. గోల్డెన్ టెంపుల్ నుంచి రథయాత్ర ప్రతిభా, బటర్‌ఫ్లై స్కూల్, యోగా సర్కిల్, తుల్జారామ్‌బాగ్ దేవాలయానికి చేరుకుంటుందన్నారు.

మెట్రోస్టేషన్‌లో చోరీకి యత్నం

వెంగళరావునగర్, జూలై 9: అమీర్‌పేట మెట్రోస్టేషన్‌లో ప్రయాణికుల ఫోన్లు చోరీ చేసేందుకు యత్నించిన ఓ వ్యక్తిని స్టేషన్ అధికారులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సోమవారం ఉదయం మెట్రోస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లో ప్రయాణికుల ఫోన్లు కాజేసేందుకు బి.కుమార్ అనే వ్యక్తి ప్రయత్నించాడు. స్టేషన్ సెక్యూరిటీ సిబ్బంది గమనించి స్టేషన్ కంట్రోలర్ పి.హనుమాన్ ప్రసాద్‌కు చెప్పారు. నిందితుడు కుమార్‌ను పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మణికొండ, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నదని బీజేపీ రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ ఆరోపించారు. గండిపేట మండల తహసీల్దార్‌కు బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా రైతు భరోసాను ప్రభుత్వం నెరవేర్చలేకపోవడం దురదృష్టకరమన్నారు. రైతులకు రెండు లక్షల రుణ మాఫీ విషయంలో విఫలమైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ఎలాంటి ఆంక్షలు లేకుండా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు దుద్దాల మల్లేశ్, బీజేపీ అధ్యక్షుడు చిక్కిరి భిక్షపతియాదవ్, నాయకులు సత్యనారాయణ, కృష్ణ, మెండే నాగేశ్, నెల్లిపల్లి బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, నాగేశ్, శ్రీనివాస్, కిరణ్, శివరాజ్, డి.నవీన్, చంద్రశేఖర్, చెన్నయ్య, చంద్రమౌళి, శివరాజ్, వెంకటేశ్, టి.నవీన్, డి.మల్లేశ్, బ్రహ్మచారి, గణేశ్, శ్రీధర్ తదితరులున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ, నాయకులు

వీసా పేరుతో మోసం.. కేసు నమోదు

వెంగళరావునగర్, జూలై 9: వీసా పేరుతో ఇద్దరు మహిళల్ని మోసగించిన ఘటన వెలుగు చూసింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ జయప్రకాశ్‌నగర్‌లో ఉండే వి.భార్గవి(41) ఫ్యాషన్ డిజైనర్. తన స్నేహితురాలైన సినీనటి జయరావు(45)తో కలిసి గతనెల 7న అమెరికాకు వెళ్లాల్సి ఉంది. అందుకోసం వీసా కోసం మణికంఠరెడ్డి అనే వ్యక్తిని సంప్రదించారు. అడ్వాన్స్‌గా రూ.52 వేలు చెల్లించారు. అనంతరం వీరితో మాట్లాడం మానేసాడు. పలుమార్లు ఫోన్లు చేసినా పట్టించుకోకపోయేసరికి తాము మోసపోయానని గ్రహించి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పర్యవేక్షణ లోపంతో చెరువులు కబ్జా

ప్రజా భవన్‌లో వినతిపత్రం అందజేస్తున్న అడికే మహేందర్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి జూలై 9: అధికారుల పర్యవేక్షణ లోపంతో చెరువుల స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని లక్ష్మీగూడ చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు అడికే మహేందర్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చెరువులను రక్షించాలని కోరుతూ మంగళవారం సోమాజిగూడలోని ప్రజా భవన్‌లోని ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ.. లక్ష్మీగూడలో రెవెన్యూ సర్వే నంబర్ 53లో గల బుల్‌బుల్ కుంట చెరువును సుమారు రూ.1.60 కోట్ల వ్యయంతో సుందరీకరణ పనులను ప్రారంభించారన్నారు. గత ఆరు నెలలుగా పనులు నిలిపి వేశారన్నారు. దీంతో అక్రమార్కులు దర్జాగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఈ విషయంపై నీటి పారుదల శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఏఈ స్వరాజ్యం నిర్లక్ష్యం, రెవెన్యూ అధికారుల సమన్వయ లోపంతో చెరువు స్థలంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. సర్కిల్ పరిధిలోని మదికుంట చెరువు, ఎర్రకుంట చెరువు, పల్లెచెరువు.. మొదలు అన్ని చెరువుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. చెరువల రక్షణకు కంచె లేకపోవడంతో ఆ స్థలాలను కబ్జా చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. - జూబ్లీహిల్స్

సత్యనారాయణ సేవలు మరువలేనివి

మఖ్దూం భవన్‌లో సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్, జూలై 9: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పార్టీకి, సమాజానికి సీపీఐ ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి తమ్మా రెడ్డి సత్యనారాయణ అందించిన సేవలు మరువలేనివని రచయిత కందిమల్ల ప్రతాప రెడ్డి అన్నారు. సత్యనారాయణ జయంతి సందర్భంగా మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నిర్మాణంలో కీలకపాత్ర వహించారని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగి పేదల అభ్యున్నతి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టి.గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్యనాయక్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్, నాయకులు ఆరుట్ల రాజుకుమార్, గోవింద్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లోని మహాంకాళి దేవస్థానంలో బోనాల వేడుకల ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వివేక్ వెంకట్‌స్వామి. చిత్రంలో టీపీసీసీ కార్యదర్శి మధుకర్‌యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ భవానీకృష్ణయాదవ్ తదితరులు. - ఖైరతాబాద్



రహ్మత్‌నగర్ డివిజన్ ఎన్ఎస్‌బీనగర్‌లో ఎల్లమ్మ కల్యాణోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక నేత మోహన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. - జూబ్లీహిల్స్

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

బండ్లగూడ, జూలై 9: గండిపేట మండలం పరిధిలోని కిస్మత్‌పూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్థుడు మన్నె మోహన్ మండల కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిస్మత్‌పూర్ గ్రామంలో ఇటీవల కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నరన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి కిస్మత్‌పూర్ గ్రామంలోని సర్వే నంబర్ 21లో ఉన్న ఒక ఎకరం 13 గుంటల స్థలాన్ని సర్వే చేసి కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జిల్లాల పునర్విభజనపై ప్రత్యేక కమిటీ

ఖైరతాబాద్, జూలై 9: జిల్లాల పునర్విభజనపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి కమిటీ వేయనున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి తెలిపారు. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ నేతృత్వంలో రోహిణ్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. లష్కర్ జిల్లా ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణగౌడ్, బాలరాజ్‌యాదవ్, జగదీశ్‌గౌడ్, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం

మైలార్‌దేవ్‌పల్లి జూలై 9: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను చేడుతున్నట్టు మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుద్వేల్ రైల్వేస్టేషన్ కాలనీలో నెలకొన్న సమస్యలపై మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ, నూతన సీసీరోడ్డు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే అభివృద్ధి పనులను చేపట్టి సమస్యలు లేకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా సకాలంలో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి మేనేజర్ జియా, వర్క్ ఇన్‌స్పెక్టర్ వినయ్, విద్యుత్ అధికారులు సురేందర్, మహేందర్, కిషోర్, ఎన్.జగన్, భరత్, శ్రీకాంత్‌రెడ్డి, రామారావు, బాబు, శేఖర్, రజిత, బాలమణి పాల్గొన్నారు.

సింగరేణి వేలం పాటను ఆపాలి

హిమాయత్‌నగర్, జూలై 9: తెలంగాణ రాష్ట్రంలో బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేసి సింగరేణి కాలరీస్‌కు కేటాయించాలని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రధాన మంత్రి బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేసే ప్రసక్తేలేదని చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు వేలం వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎంతో చరిత్ర గల సింగరేణి రాష్ట్రానికి గుండెకాయ లాంటిదని, అలాంటి సంస్థను బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రయత్నించడం తగదన్నారు. సిగరేణిపై ఆధారపడి లక్షలాది మంది కార్మికులు జీవిస్తున్నారని, వేలం వేయడం వల్ల కార్మికులు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి బొగ్గు గనుల వేలం పాటను నిలిపివేయాలని, లేని పక్షంలో కార్మికులు చేసే ఉద్యమానికి బీకేఎంయూ అండగా నిలుస్తదని పేర్కొన్నారు.

సకాలంలో పరికరాలు ఇవ్వాలి

ఖైరతాబాద్, జూలై 9: నగరర పరిశుభ్రతలో కీలకమైన జీహెచ్ఎంసీ కార్మికులకు సకాలంలో పరికరాలు ఇవ్వాలని తెలంగాణ జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం సమర్పించారు. మిద్దె కృష్ణ మాట్లాడుతూ కార్మికులకు ప్రతి నెల గంపలు, పారలు, రేఖులు, తోపుడు బండ్లు, రిక్షాలను అందించే వారని అన్నారు. కొంత కాలంగా పట్టించుకోవడం లేదన్నారు. సరైన పరికరాలు లేక విధులు నిర్వహించడంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్ఎఫ్ఏలకు సాంకేతిక కారణంగా వేతనాల్లో కోతలు జరుగుతున్నాయని, ఆయా సమస్యలను పరిష్కరించాలని జెడ్సీని కోరారు.

సమావేశాలకు అనుమతివ్వండి

శంషాబాద్ రూరల్, జూలై 9: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం శంషాబాద్ డీసీపీ రాజేశ్‌కు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్, మల్లారెడ్డి, ప్రశాంత్, భాస్కర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 12న శుక్రవారం పట్టణంలోని మల్లికా కన్వెషన్‌హాల్‌లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఉన్నాయని అన్నారు. సమావేశానికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డితోపాటు బండి సంజయ్‌తో పాటు పలువురు ఎంపీటీసీలు, ఎమ్మెల్యే ఇతర ముఖ్యనాయకులు పాల్గొంటారని అనుమతి ఇవ్వాలని కోరారు. దీంతో డీసీపీ సానుకులంగా స్పందించిన్నట్లు తెలిపారు.

కత్తితో దాడి.. ముగ్గురి రిమాండ్

కార్వాన్: యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన గుడిమల్కాపూర్ పీఎస్ పరిధిలో జరిగింది. హీరానగర్‌లో ఉండే నరేశ్ ఫైనాన్స్ వ్యాపారి. అశోక్‌కు కొంత అప్పు ఇచ్చాడు. తిరిగి చెల్లించక పోవడంతో తరచూ అడుగుండడంతో మాట్లాడుకుందామని లక్ష్మీనగర్‌లోని వీ5 బార్ వద్దకు పిలిపించాడు. నరేశ్ వెళ్లగా అశోక్ తన మిత్రులతో కలిసి కత్తితో దాడి చేశారు.

పార్కులపై అధికారుల దృష్టి

వాకర్స్‌తో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

జూబ్లీహిల్స్, జూలై 9: ప్రజారోగ్యానికి పట్టుగొమ్మలైన పార్కుల అభివృద్ధిపై అధికారులు దృష్టి పెడుతున్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్‌లోని పార్కుల్లో పర్యటించి వాకర్స్‌తో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటున్నారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఇప్పటికే 18వ సర్కిల్‌లోని జలగం వెంగళరావునగర్ పార్కు, శ్రీనగర్‌కాలనీ పార్కులను సందర్శించారు. కాగా సోమవారం ఎంపీ, ఎమ్మెల్యేకాలనీల్లోని జీహెచ్ఎంసీ నర్సరీ పార్కులో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పార్కుల్లో ఏమైనా సమస్యలున్నాయా అని వాకర్స్‌ను ఆరా తీశారు. పార్కుల్లో సీనియర్ సిటిజన్స్, వాకర్స్ కోసం పాత్ వే ఆధునీకరణ పనులతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మారిన మరణ ధ్రువీకరణ తేదీ

14 రోజుల ముందే చనిపోయినట్లు జారీ చేసిన అధికారులు

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
DEATH CERTIFICATE

జూబ్లీహిల్స్, జూలై 9: తండ్రి మరణ ధ్రువీకరణను ఇటీవల ఓ మహిళ కంప్యూటరైజ్డ్ చేయించింది. సర్టిఫికెట్‌లో మరణించిన తేదీ తప్పుగా నమోదవడంతో మెహిదీపట్నం సర్కిల్ అత్తాపూర్‌లో ఉంటున్న ఎం.సరస్వతి రెండేండ్లుగా జీహెచ్ఎంసీ కార్యాలయం చుట్టూ తిరగక తప్పలేదు. 43 ఏండ్లక్రితం జరిగిన ఘటనలో మృతుడు 14 రోజుల ముందుగానే చనిపోయినట్లు ఇటీవల జారీ చేసిన ధ్రువపత్రంలో నమోదు చేయడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్థిక శాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేసిన సత్తిరాజు బుచ్చిరాజు 1981 ఆగస్టు 31న నగరంలో కన్నుమూశారు. అయితే అప్పట్లో మరణ ధ్రువీకరణ మ్యానువల్‌గా ఇచ్చారు. ఇటీవల కంప్యూటరైజ్డ్ చేయించగా తప్పుడు తేదీతో ఇచ్చారు. విషయాన్ని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోయిందని సరస్వతి పేర్కొన్నారు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అప్‌డేట్ కాలేదన్న నెపంతో తన తండ్రి మరణ ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేయడంలేదని ఆమె వాపోయారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

హిమాయత్‌నగర్, జూలై 9: పుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మంగళవారం నారాయణగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. అడ్మిన్ ఎస్సై నరేశ్‌కుమార్ వివరాల ప్రకారం.. కింగ్‌కోఠిలోని పుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి (45) అపస్మారక స్థితిలో ఉన్నట్లు స్థానికులు గుర్తించి 100కు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి నారాయణగూడ పోలీసులు చేరుకుని 108కు సమాచారం అందించారు. వైద్య సిబ్బంది పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై క్రీం, రెడ్, గ్రీన్ ఫ్లవర్స్ గల కలర్ చొక్కా, బ్లాక్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానలోని మార్చురీకి తరలించారు. సంబంధికులు ఎవరైనా ఉంటే 040-27852579 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్రెడిట్ కార్డు నుంచి రూ.1.05 లక్షలు చోరీ

వెంగళరావునగర్, జూలై 9: జ్యోతి ష్కుడి క్రెడిట్ కార్డు నుంచి రూ.1.05 లక్షలు చోరీకి గురైన ఘటనపై మధురానగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా ఉల్లంపర్రుకు చెందిన జ్యోతిష్కుడు సత్యసాయి రామసామి(47) మధురానగర్‌లో ఉంటున్నారు. ఈ నెల 7న మధ్యాహ్నం మధురానగర్‌లో తన క్రెడిట్ కార్డును పోగొట్టుకున్నారు. అదే రోజు అతని ఖాతాలోని రూ.5 వేలు విత్‌డ్రా అయ్యాయని కార్డును బ్లాక్ చేసేందుకు ప్రయత్నించారు. ఐదు విడతల్లో వెనువెంటనే మొత్తం రూ.1.5లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

GENERAL PUBLIC NOTICE

On behalf of My Client Smt. B.Prabhavathi, W/o: B.Paravaiah Gupta, R/o: H.No. 3-6-24, Basheerbagh, Hyderabad, it is hereby informed to General Public that during travelling from Basheerbagh to Jubilee Hills on 8-07-2024, lost a bag containing the Original Sale deed bearing No. 535/1974, dated 18-02-1974, Registered in the office of SRO, Hyderabad which Executed by D.V. Rama Bai and another in favour of Smt. B.Prabhavathi, W/o: Paravaiah Gupta, if it is found by any one kindly handover to the following address.

Sd/- **CHAKILAM SESHAGIRI RAO**
Advocate
H.No.5-5-533, Plot No.18 Abhyudaya nagar, Chinthalkunta, L.B.Nagar, Hyderabad- 500 074
Mobile No. 91 8008300478

రోడ్డు ప్రమాదాల్లో 43 శాతం పాదచారులే

ఖైరతాబాద్, జూలై 9: గ్రేటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 43 శాతం మంది పాదచారులే ఉన్నారని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ వి.రాంచందర్ అన్నారు. మంగళవారం పంజాగుట్టలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలు, పౌరుల కర్తవ్యంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. 2023లో 2,370 రోడ్డు ప్రమాదాలు జరుగగా, 280 మంది చనిపోయారని, అందులో 121 మంది పాదచారులే ఉన్నారని చెప్పారు. రోడ్డు దాటుతుండగా, తప్పని సరిగా జీబ్రా లైన్ నియమాన్ని పాటించాలన్నారు. కానీ చాలా మంది పాదచారులు ఉపయోగించడం లేదన్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో షోరూం మేనేజర్లు కిషన్‌రావు, రాజేశ్, స్టోర్ హెడ్ అయాన్, బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సిబ్బంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.